

జ్వర సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఇంటింటా ఫీవర్ సర్వే

- వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రణాళిక
- ఆశాలు, ఏఎన్ఎంలతో ఇంటింటా వివరాల సేకరణ
- జ్వర పీడితుల గుర్తింపు ● ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు

జగిత్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య ఆరోగ్య శాఖ జిల్లా వ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తోంది. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు జగిత్యాల జిల్లాలో పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వేను చురుకుగా నిర్వహిస్తున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన బాధితులకు వైద్య ఆరోగ్య సిబ్బంది అండగా నిలవడంలో భాగంగా జ్వర సర్వేను చేస్తున్నారు. మలేరియా, డెంగీలతో పాటు సీజనల్ వ్యాధులను కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని మారుమూల పల్లెలు, తండాలు, గూడెల్లోని ప్రజలు ప్రతి సంవత్సరం సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. బాధితులకు అవసరమైన వైద్య పరీక్షలు, ల్యాబ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను సైతం పంపిణీ చేస్తున్నారు. ఫీవర్ సర్వే నివేదికను ప్రతిరోజు హైద్రాబాద్ వైద్య ఆరోగ్య శాఖకు పంపుతున్నారు. క్షేత్ర స్థాయిలో వ్యాధుల నియంత్రణలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాత్ర కీలకంగా ఉండేలా అధికా రులు జాగ్రత్తలు వహిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి జ్వరం లక్షణాలు ఉన్న వారికి నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 1,509 మంది జ్వరపీడితుల గుర్తింపు...

జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా జరిపిన ఇంటింటి ఫీవర్ సర్వేలో 1,509 మంది జ్వర పీడితులను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలో 2,60,516 కుటుంబాలు ఉండగా, 10,98,959 జనాభా ఉంది. ఇందులో ఇప్పటివరకు 41,674 కుటుంబాలలో 2,67,981 మంది అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 1,509 మంది జ్వరంతో బాధపడుతున్నట్లుగా గుర్తించారు. 1,074 రక్త నమూనా పరీక్షలను నిర్వహించారు. జిల్లాలో అత్యధికంగా నేరేళ్ల పీహెచ్‌సీ పరిధిలో 134 మంది, అయిలాపూర్ పీహెచ్‌సీ పరిధిలో 133 మంది జ్వరపీడితులు ఉండగా, అత్యల్పంగా అంబారిపేట పీహెచ్‌సీ పరిధిలో 21 మంది, మల్యాల పీహెచ్‌సీ పరిధిలో 25 మంది జ్వర పీడితులున్నట్లుగా సర్వేలో తేల్చారు. జిల్లా వ్యాప్తంగా 2,68,009 గృహాలను సందర్శించి 21,247 ఇళ్లలో ప్రమాదకరమైన దోమల వృద్ధికి కారణమయ్యే లార్వా ఉన్నట్లుగా గుర్తించారు.

20 వరకు డెంగ్యూ కేసులు నమోదు

భీమారం : మండల కేంద్రంలో దాదాపు 20 మంది వరకు డెంగ్యూ జ్వరాల బారిన పడ్డారు. గ్రామంలోని పరిసరాలు, బహిరంగ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు పెరిగి విష జ్వరాలకు ఆనవాళ్లుగా మారాయి. సంబంధిత వైద్య శాఖ అధికారులు డెంగ్యూ జ్వరాల బారిన పడుతున్నవారిని గుర్తించి చికిత్స అందిస్తున్నారు. మండల కేంద్రంలో పారిశుద్ధ్య లోపం కూడా జ్వరాల తీవ్రతకు కారణంగా చెబుతున్నారు. సంబంధిత అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ..

పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వల్ల దోమల ఉధృతి పెరిగి ప్రమాదకరమైన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఫీవర్ టీం సభ్యులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. పలు ఇళ్లలో కూలర్‌లలో నిల్వ ఉన్న నీటిని, పాత డబ్బాలు, పూల కుండీలు, మురుగు కాలువలలో ఉన్న నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు. యాంటి లార్వా ద్రావణాలను పిచికారి చేయిస్తున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ముందస్తు గుర్తింపు...కట్టడి

జిల్లాలో చేపడుతున్న సర్వే ద్వారా జ్వర పీడితులను ముందుగా గుర్తిస్తున్నారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా కట్టడికి ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో 24 మెడికల్ ఆఫీసర్లు, 754 మంది ఆశా కార్యకర్తలు, 80 మంది సూపర్‌వైజర్లు, 268 మంది ఏఎన్ఎంలు, 101 మంది ఎంఎల్‌హెచ్‌పీలు 28 మంది హెల్త్ అసిస్టెంట్‌లు కలిసి బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. ప్రధానంగా ఆయా కుటుంబాల్లో జ్వరాల బారిన పడిన వారు ఉన్నారా... ఉంటే ఎంతకాలంగా బాధపడుతున్నారు... అందుతున్న వైద్య సేవలు మొదలైన వివరాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా రక్తపు నమూనాలు సేకరించి మలేరియా, డెంగీ, చికెన్ గున్యా మొదలైన జ్వరాల నిర్ధారణ కోసం ఎన్ఎస్-1, ఎన్ఎస్-ఎలీసా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల ద్వారా జ్వర పీడితులను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నారు. అవసరమైన రోగులకు మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రులకు తరలిస్తున్నారు. జిల్లాలో వర్షాకాలం ముగిసే వరకు విడతల వారీగా జ్వరాల సర్వేను చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

తీవ్రతను బట్టి మెడికల్ క్యాంపులు..

జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన ఫీవర్ సర్వే ఆధారంగా, డెంగ్యూ పాజిటివ్ కేసుల గుర్తింపు ఆధారంగా తీవ్రతను బట్టి మెడికల్ క్యాంపులు పెడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 75 మెడికల్ క్యాంపులు నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. వైద్య శిబిరాలకు వచ్చిన వారికి కేవలం జ్వరాలకు సంబంధించిన మందులు ఇవ్వడం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలతో క్యాంపులు నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్నారు. ఫీవర్ సర్వే నిర్వహించడం, జ్వర పీడితులను గుర్తిస్తూ, అవసరమైన రోగులకు వైద్య పరీక్షలు అందించి మందులు పంపిణీ చేస్తున్నారు.

ఫీవర్ సర్వేతో కట్టడి

డాక్టర్ నీలారపు శ్రీనివాస్, జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి



జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఫీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నాము. ఇంటింటికీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది వెళ్లి సర్వే చేస్తున్నారు. సర్వే ఆధారంగా జ్వర పీడితులను గుర్తించి మెరుగైన సేవలు అందించడం, జ్వరాలకు కారణం అయిన దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ హిస్తున్నాము. డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మారుమూల ప్రాంతాల్లో పారిశుధ్య పనుల్లో పాల్గొంటున్నాము.

సమస్య పరిష్కారానికి చొరవచూపండి

ఎమ్మెల్యేకు ఎస్టీయూ బాధ్యుల వినతి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10: ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయులకు జూనియర్, డైట్ లెక్చరర్‌లుగా ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డీఈవో స్థాయి వరకు పదోన్నతులు కల్పించేలా చొరవచూపాలని కోరుతూ ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో నిలుపుదల చేసిన ఉపాధ్యాయులకు నెలనెల పదోన్నతులకై జీవో నెం 67ను పునరుద్ధరించి అమలు చేయాలన్నారు. అప్‌గ్రేడేషన్‌కు ముందు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కారణాలచేత ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జిల్లాకు ఇప్పటివరకు రెగ్యులర్ డీఈవో లేడని అదనపు బాధ్యతలతో డీఈవోలు ఇబ్బందిపడడంతో పాటు పర్యవేక్షణ కరువైందన్నారు. ప్రతి డివిజన్‌కు డిప్యూటీ డీఈవో పోస్టు మంజూరు చేయాలని కోరినట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్‌లు తెలిపారు.

ప్రభుత్వ విప్ అడ్లూరి వివాహ వార్షికోత్సవం



ప్రభుత్వ విప్ అడ్లూరికి స్వామి చిత్రపటం బహూక రిస్తున్న ఈవో

ధర్మపురి, ఆగస్టు 8: ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ 25వ వివాహ వార్షి కోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్-కాంతాకుమారి దంపతుల పేరట లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో ఆలయ వేదపండితులు పూజలు నిర్వహించారు. అనంతరం దంపతులకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు.

వార్షికోత్సవం సందర్భంగా టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, కౌన్సిలర్ సంగనభట్ల సంతోషి దంపతులు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం లక్ష్మణ్‌కుమార్‌ను పంచాయితీరాజ్ ఉద్యోగులు శనివారం కలిసి ఉద్యోగ భద్రత, వేతనాలు, సమస్యల గురించి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు గొట్టె రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంతోష్‌కుమార్, శివలాల్, శ్రీనివాస్, నితీష్, రవితేజ, క్రిష్ణ, నరేష్, జనార్ధన్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు. .

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి..

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



చెక్కులు పంపిణీ చేస్తున్న అడ్లూరి

పెగడపల్లి, ఆగస్టు 10 : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని బతికెపల్లి కొచ్చెరువు గుట్ట ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ. 40 లక్షలతో చేపట్టనున్న పనులను శనివారం అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై శంఖుస్థాపన చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వనమహోత్స వంలో భాగంగా మొక్కలు నాటి, 238 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్, 16 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అడ్లూరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి సీ ఎంఆర్ఎఫ్ ద్వారా సాయం మంజూరు చేయించి చెక్కులు స్వయంగా అందించాలనే లక్ష్యంతో సెలవు రోజైనప్పటికి కార్యక్రమం ఏర్పాటు చేసి చెక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గా గెలిపించిన ప్రజల బాగోగుల కోసం వారానికి నాలుగు రోజులు నియోజకవర్గ ప్రజలకు అందు బాటులో ఉంటానని, ప్రజలు నేరుగా వచ్చి కలవాలన్నారు. సీఎం నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు చేస్తున్నట్లు పేర్కొంటూ, నియోజకవర్గ అభివృద్ధి సంక్షే మంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, అర్హులైన పేదలందరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ రాజశేఖర్, ఏఈ శంషేర్ అలీ, గిర్దావర్ శ్రీనివాస్, పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, నాయకులు శ్రీనివాస్, శోభారాణి, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి, మల్లారెడ్డి, భాస్కర్, లక్ష్మి నారాయణ, ప్రవీణ్, స్వామి పాల్గొన్నారు.

‘విద్యార్థుల మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం’



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10: రాష్ట్రంలో జరుగుతున్న విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఏబీవీపీ నాయకులు రంజిత్‌కుమార్, రాకేష్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక కొత్తబస్టాండ్ వద్ద రహదారిపై పెద్దాపూర్ హాస్టల్‌లో విద్యార్థి మృతి ఘటనను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. పెద్దాపూర్ హాస్టల్ ఘటనపై ఇప్పటివరకు రాష్ట్రప్రభుత్వం స్పందించకుండా పాముకాటు నెపంతో కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం దురదృష్టకరం అన్నారు. 15రోజుల్లో హాస్టల్లో ఇద్దరు మృతి చెందడం ప్రభుత్వం, అధికారుల పనితీరుకు నిదర్శనం అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో సుమారు 30మంది విద్యార్థులు మరణించారని, ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అజయ్, శ్రీనివాస్, సునీల్, హరీష్, నిఖిల్, అభిషేక్, విఘ్నేష్, ప్రణయ్, శివ, హర్షవర్ధన్, విష్ణు, మనోజ్ పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సు కోసమే జంతు సంరక్షణ కేంద్రం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10: పట్టణ ప్రజల శ్రేయస్సు కోసం జంతు సంరక్షణ కేంద్రంను ఏర్పాటు చేసినట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక టీఆర్‌నగర్‌లో రూ.35 లక్షల పట్టణ ప్రగతి నిధులతో నిర్మాణం చేసిన జంతు సంరక్షణ కేంద్రాన్ని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితమే జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కుక్కల కుటుంబ నియంత్రణ కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ప్రతి రోజూ 16 కుక్కలకు శస్త్ర చికిత్స చేస్తారన్నారు. ఇటీవల కాలంలో కుక్కల దాడికి గురయ్యే ప్రమాదాలను మనం గమనిస్తున్నామని ఇందులో భాగంగానే పట్టణ సమస్యలు, వివిధ వార్తా ప్రసారసాధనాలలో వచ్చే కథనాలను తెలుసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిరుపేద వర్గాలకు అండగా నిలిచి న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీఆర్‌నగర్‌లో 150 మందికి ఇళ్లు మంజూరు చేశామని, మరికొంత మందికి లబ్ది జరిగేలా చూస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా ప్రజల సహకారంతో జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, జిల్లా వెటర్నిటీ అధికారి భోనగిరి నరేష్, స్థానిక కౌన్సిలర్‌లు దేవేందర్ నాయక్, చాంద్‌పాషా, డీఈ యాదగిరి, ఏవో శ్రీనివాస్, ఆయా వార్డుల ప్రజలు, నాయకులు, పాల్గొన్నారు.



జంతు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

●జగిత్యాల నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో గల సరస్వతీ టెంపుల్ పైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్దిదారుల కోసం రూ. 14కోట్లతో నిర్మిస్తున్న 14లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్, పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరిశీలించారు. గత ప్రభుత్వంలో నిర్మించిన 500 ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో పాటు, ప్రస్తుతం నిర్మించిన 4500 ఇళ్లకు అవసరమైన నీటిని అందించేందుకు ఈ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట బల్దియా చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మెన్ శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య, డీఈ జలందర్ రెడ్డి, పలువురు కౌన్సిలర్‌లున్నారు.

సీపీ గెట్‌లో రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు

సారంగాపూర్, ఆగస్టు, 10: తెలంగాణ సీపీ గెట్ 2024 (కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్) కోసం నిర్వహించి పరీక్ష ఫలితాలు శనివారం రోజున విడుదల కాగా మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన బాస గంగోత్రి ఎంసెస్సీ బాటనీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు సాధించింది. గంగోత్రి పదవతరగతి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలిక పాఠశాలలో చదివి టాపర్‌గా నిలిచింది. జగిత్యాల మహిళ డిగ్రీ కళాశాలలో చదువుతోంది. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ భూక్య సరళ సురేందర్, మాజీ సర్పంచ్ ప్రసాద్ గౌడ్, ఇబ్రహీం, తిరుపతిరెడ్డి, ఆనందర్‌రెడ్డి, బేర మహేష్, గ్రామ స్థులు గంగోత్రిని అభినందించారు.

ఎన్ఎస్‌వీ విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10: కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలలో ఎస్ఎస్‌వీ డిగ్రీ పీజీ కళాశాల జువాలజీ విభాగంలో కొండబత్తిని సాత్విక అనే విద్యార్థిని స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విద్యార్థినిని అభినందించారు. స్టాటస్టిక్ విభాగంలో స్టేట్ 19వ ర్యాంకు సాధించగా ఎంకాం మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఏడుగురు విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించినట్లు యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థులను జీవన్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. జగిత్యాల లాంటి గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ విద్యను అందించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం జిల్లాకే గర్వకారణం అన్నారు. అధ్యాపక బృందానికి కరస్పాండెంట్ యాద రామకృష్ణను అభినందించారు.

గురుకుల పాఠశాలలోని మరణాలపై న్యాయ విచారణ చేపట్టాలి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలోని వరుస విద్యార్థుల మరణాలపై న్యాయ విచారణ చేపట్టాలని టీజేఎస్ నాయకుడు కంతి మోహన్‌రెడ్డి, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు ఐలేనేని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులు పడుకోనే గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందిన విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురైన సంఘటనపై ఉన్నత అధికారులతో న్యాయ విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలో కనీస వసతులు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందని, కనీసం పడుకునే గదులు, బాత్‌రూమ్‌లు సరిగా లేవని, చెత్తతో కూడుకున్న ఆవరణంతో పాములు సంచరించడం నిర్లక్ష్యం కనిపిస్తోంన్నారు. గురుకులంలో చదువుకునే విద్యార్థులకు పూర్తి స్థాయిలో వసతులు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకుంట శంకర్, వన్నెల శశికుమార్, నక్క గంగారాం, చిన్నారెడ్డి, తునికి రాజేష్, బొమ్మెల జలంధర్, అల్లే నరేష్, సంగేపు ముత్తు, తదితరులు పాల్గొన్నారు.

మూడురోజుల్లో పనులు పూర్తి చేయాలి

- విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10 : మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న పనులను మూడు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం గురుకుల పాఠశాలలో చేస్తున్న పనులను పరిశీలించి, పనులు చేపిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్‌కి పలు సూచనలు చేశారు. 15 రోజుల వ్యవధిలో గురుకుల పాఠశాలల్లో ఇరువురు విద్యార్థులు అనుమానాస్పదంగా మృతి చెందడం, మరో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కలిగించింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలో శిథిల వ్యవస్థలో ఉన్న రేకుల షెడ్లు, భవనాలు, పాత కట్టడాలను కూల్చివేశారు. తరగతి గదుల వేనుక ఉన్న పాడు బట్టా బావులను పూడ్చి వేశారు. గురుకులం ప్రహరీ వెంట ఎపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలు, పొదలు తొలగించారు. మరుగుదొడ్లను శుభ్రం చేయించి శానిటేషన్ పనులు చేయించారు. అసంపూర్తిగా నిర్మించిన నూతన భవనంలో కరెంట్, ఫ్లబింగ్ ఏర్పాటు చేయిస్తున్నారు. తరగతి గదులలో అస్వ వ్యస్తంగా ఉన్న కిటికీలకు మరమ్మతులు చేయించారు. డైనింగ్ హాల్ భవనానికి రంగులను వేయిస్తున్నారు. ఆవరణలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయిస్తున్నారు. అధికారులు జేసీబీ వాహనంతో పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తుండగా విషపూరితమైన పాములు సంచరిస్తుండడం గుర్తించారు. అప్రమత్తమై పాములు పట్టే వారిని పిలిపించి వాటిని అక్కడి నుంచి అడవి ప్రాంతంలోకి తరలింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదువుకోనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులతో ఏర్పాట్లు చేయిస్తామన్నారు. అవసరమైన చోట దిద్దుబాటు చర్యలు చేపట్టామన్నారు. పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులు మొండి మోక్షిత్, హేమంత్‌లు ఆరోగ్య పరిస్థితులు విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, వారు కోలుకుంటున్నట్లు నిజామాబాద్ ఆసుపత్రి వైద్యులు తెలిపినట్లు మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల ఇన్‌చార్జి డీసీవో శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌మహ్మద్, ఆర్ఐ ఉమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఆసీఫ్, అశోక్‌గౌడ్, సిబ్బంది, పాల్గొన్నారు.



పెద్దాపూర్ గురుకులంలో అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

EDUCATION

★ SSC / INTER / DEGREE / P.G / MBA ONLINE EXAM కొరకు వెంటనే సంప్రదించండి. STUDENT ACADEMY JAGTIAL 94908 62917

AJK-197096

ADMISSION - 2024-25

★ M.L.T/ MPHW (F) / ANM / ACP/ CSE ELG: SSC PASS. D.M.L.T / DMPHA (M), D.OA / DMIT DMST / DANS / DRGA ELG: INTER ANY GROUP OR DIPLOMA SAGAR PARAMEDICAL COLLEGE, 7HILLS COMPLEX, MUKARAM PURA, KARIMNAGAR CELL NO : 9963937007 / 8179329761 OPP: KARIMNAGAR MILK DAIRY TATA CAR SHOW ROOM JAGITYAL CALL NO:9515986530

AJK-

RENT/LEASE

★ అల్లినూర్‌లో పరమిత ఐరిస్ వరల్డ్ స్కూలు యొక్క కాంపౌండ్ గోడను ఆనుకొని 30 గుంటల కమర్షియల్ ల్యాండ్ కిరాయికు లేదా లీజుకు ఇవ్వబడును. Ph:9390978999/7702388808

AJH-446

RENT/LEASE

★ అల్లినూర్ గ్రామములో కేంద్రీయ విద్యాలయం దగ్గర 30 ఫీట్ల రోడ్డుకు 25 గుంటల భూమిని కిరాయికు లేదా లీజుకు ఇవ్వబడును. Ph:9390978999 / 7702388808

AJH-447

TO-LET

★ కరీంనగర్ నుండి పెద్దపల్లికి పోయేటప్పుడు 100 ఫీట్ల తోవకు బొమ్మకల్ ఫ్లై ఓవర్ దగ్గర, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపుకు ఎదురుగా గల బిల్డింగ్‌లో కింద షట్టర్ మరియు పైన 2BHK ఫ్యామిలీ పోర్షన్ కిరాయికి ఇవ్వబడును. Ph:9390978999 / 7702388808

AJH-445

3+2 స్కీం కలదు

CHANGE OF NAME

★ I, VEERABATTINI SRINIVAS LINGAIAH S/O. VERABATTINI LINGAIAH RAMAN AGE 53 YRS, R/O H.NO. 1-5-15/3, ARAVINDNAGAR, JAGTIAL PROPER & MANDAL OF JAGTIAL DIST (OLD NAME) HAVE CHANGED MY NAME AS VEERABATTINI SRINIVAS S/O. VEERABATTINI LINGAIAH (NEW NAME). VEERABATTINI PADMA (OLD NAME) VEERABATTINI PADMAJA (NEW NAME)

AJK-197097

మా చిత్రంలో నటించే అవకాశం

★ శ్రీ వెంకట లక్ష్మీనరసింహ ప్రొడక్షన్స్‌లో బాలా బోనమతి చిత్రం సెప్టెంబర్ 19న రామానాయుడు స్టూడియోలో షూటింగ్ ప్రారంభం. అన్ని వయసుల కొత్త వారికి యాక్టింగ్ ఫ్రీగా నేర్పిస్తున్నాం. మా సినిమాలో అవకాశం ఇస్తున్నాం. నూతన నటీనటులు కావాలి.ఫ ఫోటోలు మా వాట్సప్ నెం.7981403355కు పంపండి. ఫిలింనగర్ Hyd. నరసింహారెడ్డి డైరెక్టర్.

AJH-002567

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640

జగిత్యాల :- సెల్ : 9985411262

మెట్‌పల్లి :- సెల్ : 7013142966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 9985411063

పెద్దపల్లి :- 95509 00238



అత్తింటి వారి దాష్టీకం

- భర్త సంవత్సరీకానికి ఇంటికి వచ్చిన మహిళ
- తాళం వేసుకొని వెళ్లిపోయిన అత్తామామలు

హుజూరాబాద్, ఆగస్టు 10: అనారోగ్యంతో భర్త చనిపోగా పిల్లలతో కాలం వెళ్లదీస్తున్న క్రమంలో అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారు. శని వారం భర్త సంవత్సరీకం పెట్టేందుకు ఇంటికి రాగా అత్తామామలు తాళం వేసుకొని వెళ్లిపోయారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన శ్రావణ్‌కు ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామానికి చెందిన రవళితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. గత ఏడాది ఆగస్టు నెలలో శ్రావణ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. ఇల్లును ఖాళీ చేసి వేరే చోట ఉం డాలని చెప్పడంతో రవళి వేరే చోట నివాసం ఉంటుంది. భర్త సంవత్సరీకం చెద్దామని శనివారం ఇంటికి రాగా అత్తామామలు ఇంటికి తాళం వేసుకొని వెళ్లి పోయారు. చేసేది ఏం లేక ఇంటి ఎదుట భర్త ఫొటో పెట్టుకుని రవళి తన పిల్లలతో కలిసి సంవత్సరీకం నిర్వహించింది. చుట్టు పక్కల వారు ఈ పరి స్థితిని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తమ అత్తామామలు వేధింపులకు గురి చేస్తున్నారని, తనకు, తన బిడ్డలకు న్యాయం చేయాలని రవళి వేడుకుంది.

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలివ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు టి సాగర్


నినాదాలు చేస్తున్న నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 10: రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న నిరుపేదలకు పట్టాలిచ్చి సౌకర్యాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి సాగర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పవర్‌హౌస్ కాలనీలోని ప్రైవేట్ గార్డెన్స్‌లో సీపీఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ తెలంగాణ రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మహేశ్వరి పార్టీ జెండా ఆవిష్కరించగా జిల్లా కార్యదర్శి యాకయ్య తరగతులను ప్రారంభించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి నిరుపేదలు ఇళ్లు నిర్మించుకొని నివాసముంటుంటే సరైన రోడ్లు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఇళ్ల కేటాయింపునకు బడ్జెట్‌లో నిధులేమి లేవన్నారు. నిరుపేదలకు కేంద్రప్రభుత్వం 10లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి 5 లక్షల రూపాయలు ఇవ్వడమేకాకుండా పట్టాలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తరగతులకు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లిల్లల బాలకృష్ణ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో వేల్పుల కుమార స్వామి, ఎం రామాచారి, భాగ్య, అనూష, సృజన, భవాని, మహేశ్వరి, జమున, వాణి, శివ కుమార్, సతీష్, బాలకృష్ణ, క్రాంతి, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల నుంచి గుడిసె వాసులు పాల్గొన్నారు.


ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ


ధర్మపురి, ఆగస్టు 10: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో మొదటి శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయాల్లో ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పం డితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

















గురుకుల విద్యార్థి అనిరుధ్ అంత్యక్రియలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 10: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులం అస్వస్థతకు గురై మృతి చెందిన విద్యార్థి ఎడమల్ల అనిరుధ్ అంత్యక్రియలను బాలుడి అమ్మమ్మ ఊరు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో శనివారం నిర్వహించారు. మృతుడి తండ్రి కృష్ణారెడ్డి గల్ఫ్ నుంచి చేరుకోవడంతో అంతిమ సంస్కారాలు జరిపించారు. కన్న కొడుకు చనిపోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

అనిరుధ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

విద్యార్థి అనిరుధ్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో విద్యార్థి అనురుధ్ మృతదేహం వద్ద శనివారం నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవల నారాయణపూర్‌లో గుండెపోటుతో మృతి చెందిన లింగాల సురేశ్ కుటుంబ సభ్యులతోపాటు మండల కేంద్రంలో కుక్కల దాడిలో గాయ పడిన చిన్నారులను కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, లింగాగౌడ్, రాంరెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, రాజు, శ్రీనివాస్, రాములు ఉన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య


రమేష్ మృతదేహం

సైదాపూర్, ఆగస్టు 10: మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన కొలకాని రాజు (32) అనారో గ్యంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆరోగ్యం దెబ్బతిని కడుపునొప్పి వచ్చేది. శుక్రవారం కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డు పైపునకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. రాజు భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.



ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్ట్



నేరాలకు పాల్పడిన నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ, చోరీకి గురైన ద్విచక్ర వాహనాలు

మెట్‌పల్లి , ఆగస్టు 10 (ఇబ్రహీంపట్నం): రద్దీగా ఉన్న ప్రాంతంలో బైకులు పార్క్ చేసి హ్యాండిల్ లాక్ వేయకుండా ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను మెట్‌పల్లి పోలీసులు పట్టుకుని కటకటాలకు పంపారు. జగిత్యాల జిల్లా పరి ధిలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల టౌన్, గొల్లపల్లితో పాటు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, కమ్మర్‌పల్లి, పోలీస్ స్టేషన్ పరిధిలో కొంత కాలంగా హ్యాండిల్ లాక్ వేయని ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను, దొంగ సొత్తును కొన్న మరో ఇద్దరు నిందితులను శనివారం మెట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను ఎస్పీ పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం గుమ్మిర్యాల గ్రామానికి చెందిన మన్నే లక్ష్మణ్ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాడు. ప్రమాదవశాత్తు కాలు విర గడంలో డ్రైవర్ వృత్తి మానేసి మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడ్డాడు. సు లువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో దొంగతనాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో హ్యాండిల్ లాక్ వేయని బైక్‌లను లక్ష్యం చేసుకుని రద్దీగా ఉండే మార్కెట్ ఏరియా, ఆసుపత్రులు, వివిధ షాపుల ముందు నిలిపిన బైక్‌లను దొంగతనం చేయడం ప్రారంభించాడు. ఇందుకు ముందుగా వివిధ రకాల మోటార్ సైకిళ్ల తాళం చేవిలని సేకరించి వాటి సహాయంతో ద్విచక్ర వాహనాలను చోరీ చేసేవాడు. గత సంవత్సరం నుంచి జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలో మొత్తం 6 లక్షల విలువ గల 20 ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. జగిత్యాల జిల్లాలో 13 బైక్‌లు, నిజామాబాద్ జిల్లాలో 7 బైక్‌లు అపహరించారు. చోరీ చేసిన బైక్‌లను నిర్మల్ జిల్లా మామడ మండలం పొం కల్ గ్రామానికి చెందిన మోహమ్మద్ మోసిన్ (ఏ2) చికెన్ షాపు నిర్వహకుడికి, అబ్దుల్ రషీద్‌కు(ఏ3) బైక్ మెకానిక్ షాపు నిర్వాహకుడు ఇద్దరికి చెరో 10 ద్విచక్ర వాహనాలను ఒక్కో బైక్‌ను 8 వేల నుంచి 10 వేల రూపాయల చొప్పున అమ్మి వచ్చిన డబ్బులని జ ల్సాలకు ఖర్చు చేసేవాడు. దొంగ సొత్తు అని తెలిసి కూడ మోహమ్మద్ మోసిన్ అబ్దుల్ రషీద్ లక్ష్మణ్ వద్ద తక్కువ ధరకు కొని ప్రజలకు ఎక్కువ ధరలకు అమ్మి సోమ్ము చేసుకునే వారు.

కొంత కాలంగా ద్విచక్ర వాహనాల చోరీలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎస్పీ అశోక్ కుమార్ అదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు పర్యవేక్షణలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగిస్తూ బృందాలుగా ఏర్పడి పట్టణ శివారులోని వెంకట్రావ్‌పేట వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా వస్తున్న లక్ష్మణ్‌ని పట్టుకుని విచారించగా ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసినట్లు అంగీ కరించడంతో అతనితో పాటు మిగతా నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నింది తులను పట్టుకోవడంలో చకచాక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

రూ. 27000 నగదు ద్విచక్ర వాహనం స్వాధీనం

కోరుట్ల: దొంగతనాలకు పాల్పడుతున్న ఒక మైనర్‌తో పాటు మరో వ్యక్తిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ కిరణ్ కుమార్‌తో కలిసి సీఐ అరెస్టు వివ రాలను వెల్లడించారు. పట్టణంలోని కావేరి గార్డెన్ వద్ద ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక యువకుడు, మరో బాలుడు అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. జగిత్యాల మండలం పొలాస గ్రామానికి చెందిన హర్షద్ అతని అల్లుడిగా గుర్తించారు. హర్షద్ అతని అల్లుడితో కలిసి చోరీలకు అలవాటు పడ్డారు. ఈ నెల 5వ తేదీన కోరుట్ల పట్టణంలో ఇద్దరు కలిసి ఓ ద్విచక్ర వాహనం, 7వ తేదీన ఐబీ రోడ్డులోని ఓ కిరాణం దుకాణంలో షెటర్ తాళం పగులగొట్టి దుకాణంలోని రూ 27,000 ఎత్తుకెళ్లారు. కోరుట్ల పట్టణంతో పాటు జగిత్యాల జిల్లా పరిధిలోని వివిధ చోరి కేసుల్లో వీరు నిదితులుగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద ఉన్న 27,000 నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో చాక్యచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ, కానిస్టేబుల్స్ ఎల్లయ్య, సత్తయ్య, సాగర్, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్ బాబు

బాలుడిపై వీధి కుక్క దాడి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10 : మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలో బాలుడిపై వీధి కుక్క దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామంలోని ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడు నిహాన్స్‌ను వీధి కుక్క అకస్మాత్తుగా దాడి చేసింది. దీంతో బాలుడు అరవడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు గమనించి కుక్కను తరిమి గాయపడ్డ నిహాన్స్‌ను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామాల్లో వీధి కుక్కలతో చిన్నపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, ఆగస్టు 10: విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మానకొండూర్ సబ్‌స్టేషన్‌లో జేఎల్ఎంగా కార్తీక్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన చేయాల్సిన పనులను మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన చొప్పరి బుచ్చయ్యతో చేయిస్తుంటాడు. మానకొండూర్ శివారు గ్రామమైన బంజేరుపల్లిలో రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేస్తుండగా బుచ్చయ్య విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ బుచ్చయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

ఆపదలో ఉన్న వృద్ధుడికి అండ

అనాథాశ్రమంలో చేర్పించిన సీఐ సరిలాల్


లింగయ్యను ఆశ్రమానికి అప్పగిస్తున్న సీఐ సరిలాల్


కరీంనగర్ క్రైం, ఆగస్టు 10: ఇద్దరు కూతుర్లు ఉన్నా ఎవరూ అతని పోషణ పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ఎక్కడికి వెళ్లాలో తెలియక ఓ వృద్ధుడు కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకుని అక్కడే గడుపుతుండగా శనివారం కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్ చేరదీసి కరీంనగర్‌లోని వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమంలో చేర్పించారు. సీఐ సరిలాల్ తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేటకు చెందిన ఇల్లందుల లింగయ్య దిక్కుతోచని స్థితిలో కరీంనగర్ బస్టాండ్‌లో తిరుగుతూ సీఐ సరిలాల్‌కు కనిపించాడు. లింగయ్య వివరాలు సేకరించగా తనకు ఇద్దరు కూతుర్లు ఉన్నారని, ఎవరూ తన ఆలనాపాలనా చూడకపోవడంతో మనస్థాపంతోనే బస్టాండ్‌కు చేరుకున్నానని వృద్ధుడు లింగయ్య తన బాధను సీఐతో వెల్లగక్కాడు. వెంటనే సీఐ సరిలాల్ కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీలోని వీడీ ఫౌండేషన్ వీరబ్రహ్మేంద్ర అనాథవృద్ధుల ఆశ్రమం నిర్వాహకుడు వీరమాధవ్‌కు సమాచారం అందించాడు. వీరమాధవ్‌ను ఠాణాకు పిలిపించుకుని వృద్ధుడు లింగయ్య బాగోగులు చూసుకోవాలని అతన్ని అప్పగించారు. వీరమాధవ్‌ను సీఐతో పాటు స్థానికులు అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీ డ్రైవర్ ఆత్మహత్య


రమేష్ మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 10: పట్టణానికి చెందిన మురుకుట్ల రమేష్ (49) అనే లారీ డ్రైవర్ ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రమేష్ ఫైనాన్స్‌లో 5 లక్షల లోన్ తీసుకొని లారీని కొన్నాడు. ఆ తరువాత 12 లక్షల లోన్ తీసుకుని మరో లారీ కొన్నాడు. వర్షాల కారణంగా రెండు నెలలపాటు లారీ నడవకపోవడంతో ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించలేదు. ఫైనాన్స్ కంపెనీకి చెందిన వ్యక్తులు ఇటీవల రమేశ్ ఇంటికి వచ్చి గొడవ చేశారు. మనస్తాపం చెందిన రమేష్ ఈ నెల 8న పురుగుల మందు తాగగా కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. రమేష్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రమేష్ భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. రమేష్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ చైర్మెన్ కొత్తూరి మహేశ్, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి ఐదు వేల నగదును రమేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.





శ్రీపాద నుంచి తగ్గిన ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,602 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.846 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో ఒక మోటార్ నుంచే నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.18 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు నుంచి సర్జిపూల్‌కు వచ్చిన నీటిని రెండు పంపుల ద్వారా ప్రతిరోజు 6,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌కు ప్రతిరోజు 6,600 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 3,700 క్యూసెక్కులు ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 17.06 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. అన్నపూర్ణ ప్రాజెక్టుకు 6,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు తగ్గిన నీటి విడుదల

జగిత్యాల: వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను శనివారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 500 క్యూసెక్కులు తగ్గింపుతో 2,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 3,333 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 3,333 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కొండగట్టుకు శ్రావణ శోభ

● అంజన్నను దర్శించుకున్న వేలాది భక్తులు


శేషవాహనంపై స్వామివారు

మల్యాల, ఆగస్టు 6: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం శ్రావణ శోభను సంతరించుకుంది. శనివారం వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. శ్రావణ సప్తాహ ఉత్సవాలు శనివారం కూడా కొనసాగాయి. అంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన రత్నమాల అనే భక్తురాలు దైవదర్శనానికి వచ్చి చేతిబ్యాగ్ పోగొట్టుకోగా ఏఎస్సై చిలుక శ్రీనివాస్, హోంగార్డు రమేష్‌లు బ్యాగు వెతికి భక్తురాలికి అప్పగించారు.

బీసీ కమిషన్ సభ్యుడి పూజలు

బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రత్ పటేల్ శనివారం ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కటుంబ సమేతంగా వచ్చిన వారికి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు శాలువాలతో సత్కరించారు.

పల్లె నుంచి ఢిల్లీకి..

స్వాతంత్ర్య వేడుకలకు విద్యార్థినికి ఆహ్వానం


శ్రీచందన

రాయికల్, ఆగస్టు 10: రాయికల్ మండలంలోని రామారావుపల్లె గ్రామానికి చెందిన విద్యార్థిని పంబాల శ్రీచందను ఈ నెల 15వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య వేడుకలకు హాజరు కావాలని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం అందింది. భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించిన దేశ భక్తుల వేషధారణ పోటీలో శ్రీచందన సుభాష్ చంద్రబోస్ వేషం ధరించి పోటీలో పాల్గొనగా దేశవ్యాప్తంగా 250 మందిని ఎంపిక చేశారు. ఎంపికైనవారితో పాటు వారి సహాయకులకు స్వాతంత్ర్య వేడుకలు వీక్షించేందుకు ఆహ్వానం అందిందని గైడ్ టీచర్ కడకుంట్ల అభయ్‌రాజ్ తెలిపారు.

పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 10: ఈనెల 31, సెప్టెంబరు 1, 2తేదీలలో హైదరాబాద్‌లో జరుగనున్న పీవోడబ్ల్యూ 7వ రాష్ట్ర మహాసభలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె జ్యోతి పిలుపునిచ్చారు. శనివారం గోదావరిఖనిలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మహాసభల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ఇతర సమస్యలపై చర్చించి భవిష్యత్‌లో కార్యచరణను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిందితులపై కఠినచట్టాలు అమలు చేయలేకపోయారన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా కఠినంగా వ్యవహరించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధ్యులను శిక్షించి మహిళలను రక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి రజిత, బుచ్చమ్మ, మంగ, అమృత, స్వప్న, సరోజన, కవిత, పద్మ, శారదా, సత్యమ్మ, పద్మ, స్వర్ణలత పాల్గొన్నారు.

ఆగిఉన్న గూడ్స్ రైలులో అగ్నిప్రమాదం

జగిత్యాలరూరల్, ఆగస్టు 10 : జగిత్యాల పట్టణంలోని లింగంపేట రైల్వేస్టేషన్‌లో ఆగిఉన్న గూడ్స్ రైలులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగంపేట రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలులో బొగ్గువ్యాగన్‌లో మంటలు చూసి స్టేషన్‌మాస్టర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన జగిత్యాల అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వెంటనే మంటలను ఆర్పివేశారు. ఈసంఘటనలో సుమారు రూ. 5 లక్షల వరకు నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి ఎ. కృష్ణకాంత్ తెలిపారు. మంటలు ఎలా వ్యాపించాయి అనేది అధికారులు విచారణ చేస్తున్నారు. ఎల్ఎఫ్ రవీందర్, ఆపరేటర్ మల్లేశం, ఫైర్ మన్‌లు నరేష్, కార్తీక్, అరుణ్, శ్రీనివాస్ ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10: దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఏకకాలంలో రూ.31వేలకోట్ల రూపాయలను రుణమాఫీ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీకే దక్కిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక బీట్ బజార్‌లో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో రుణమాఫీ పొందిన 248 మంది రైతులకు రూ.కోటి 56లక్షల నూతన రుణాల చెక్కులను శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15తేదీన రూ. 2లక్షల రుణమాఫీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ప్యాక్స్ కేంద్రం నుంచి రైతులకు బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందని, ప్రజల సమస్యల పరిష్కారం, ఈ ప్రాంత అభివృద్ధికోసం కృషి చేస్తానన్నారు. రైతులను రుణవిముక్తులను చేయడం కోసం ప్రభుత్వం రుణమాఫీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్‌లో ఉన్న పంటలను సాగు చేసి లాభాలు గడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కల్లెడ ప్యాక్స్ చైర్మన్‌లు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, సీఈవో వేణు, డైరెక్టర్‌లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి- ఎస్ఎస్ఏ జేఏసీ వినతి

●తెలంగాణ సమగ్ర శిక్ష అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా సెక్రెటరీ కుడుకల రవీందర్ ఎమ్మెల్యే క్వార్టర్‌లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో విద్యాశాఖలో గత 15ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ రెగ్యులరైజేషన్ చేస్తూ రెగ్యులరైజేషన్ అయ్యేంత వరకు మినిమం స్కేల్ అమలు చేయాలని 15ఏళ్లుగా విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులకు టుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రవీందర్ తెలిపారు.


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

వసతి గృహాలను తనిఖీ చేసిన ఎంపీవో

జగిత్యాలరూరల్, ఆగస్టు 10 : కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి వసతిగృహం, లక్ష్మీపూర్ జ్యోతిబాపులే వసతి గృహం, పొలాస బీసీ వసతి గృహాలను శనివారం జగిత్యాల రూరల్ మండల ఎంపీవో కందుకూరి రవిబాబు తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాల పరిశుభ్రత పై ఆరా తీశారు. శానిటేషన్ నిర్వహించి, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా, క్రిమికీటకాలు, పాములకు బలికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం రక్షణదళాలకు సంబంధించిన ఆర్మీ, ఏయిర్‌ఫోర్స్ తదితర ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మాత శిశుసంరక్షణ జిల్లా అధికారి జైపాల్‌రెడ్డి


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న మాతా శిశుసంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్, ఆగస్టు 10 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మాతశిశుసంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధరూర్ ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లో విద్యార్థులకు ఉచివైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో నీరు నిల్వఉండకుండా చూసుకోవాలని సూచించారు. డెంగ్యూ వ్యాధిపట్ల ప్రజలకు అవగాహనకల్పించారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తపాలా శాఖ అధికారి సఫియొద్దీన్


మల్లాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న తపాలా అధికారి సఫియొద్దీన్

మల్లాపూర్, ఆగస్టు 10 : తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాఖ అధికారి సఫియొద్దీన్ సూచించారు. శని వారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ తపాల శాఖ ద్వారా పిల్లలకు, మహిళలకు, వాహనదారులకు, రైతులు, వ్యాపారస్థులు, కూలీలతో పలు రంగాల వారికి సేవలను అందిస్తోందన్నారు. వీటి వల్ల ప్రజలకు అనేక లాభాలు అందుతాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు మహేష్, రాజేశం, వెంకటరమణ, రామకృష్ణ, రమలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

రాయికల్, ఆగస్టు 10: రాయికల్ పట్టణానికి చెందిన పాతూరి సాత్విక రెడ్డి సీపీ గేట్-2024 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 7వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని రాయికల్ సంఘ మిత్ర యూత్ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పటేల్ శివా రెడ్డి, తురగ శ్రీధర్, జిల్లాల సూర్యం, పెద్దన్న, దివాకర్, పాతూరి సురేష్, కురుమ సుదర్శన్, దుర్గం శ్రీకాంత్, గంగారెడ్డి, ఎద్దండి దివాకర్ పాల్గొన్నారు.

రాయితీపై అద్దె బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల, ఆగస్టు 10 : వివాహ శుభ కార్యక్రమాలు, వివాహయాత్రలకు ఆర్టీసీ కల్పిస్తున్న అద్దె బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఆర్టీసీ డీఎం మనోహర్ కోరారు. శనివారం ఆర్టీసీ డీఎం కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అద్దెకు బస్సు సౌకర్యం గురించి వివరించారు. పెళ్లి, వివిధ శుభకార్యక్రమాలకు ఆర్టీసీ సంస్థ నుంచి అద్దెకు బస్సు సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. ఎలాంటి డిపాజిట్ లేకుండా 10 శాతం రాయితీతో ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తున్నట్లు తెలిపారు. మరిని వివరాల కోసం డిపో మేనేజర్ 9959225928, ట్రాఫిక్ సూపరిండెంట్ 7382850611, కార్గో మార్కెంటింగ్ ఎగ్జిక్యూటివ్ 9254298572 సెల్ నంబర్‌కు సంప్రదించాలన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీలకు అందని వేతన బకాయిలు

● మాజీ ప్రజాప్రతినిధులకు తప్పని ఎదురుచూపులు

● రాష్ట్రంలో 508 మంది జడ్పీటీసీ...5,782 మంది ఎంపీటీసీ స్థానాలు


జగిత్యాల జిల్లా పరిషత్ కార్యాలయం

జగిత్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గౌరవ వేతనాల కోసం స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు ఎదురు చూస్తున్నారు. జడ్పీ చైర్మన్, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులకు ఆరు నెలలుగా గౌరవ వేతనం రావడం లేదు. గత నెల 4వ తేదీతో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పదవీ కాలం ముగిసింది. అలాగే స్థానిక సంస్థలు నిధుల కొరతతో కొట్టుమిట్టాడు తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 508 మంది జడ్పీటీసీలు, 5,782 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. ఇందులో జగిత్యాల జిల్లాలో 18 మంది జడ్పీటీసీ సభ్యులు, 18 మంది ఎంపీపీలు, పలువురు ఎంపీటీసీ సభ్యులున్నారు. జడ్పీ చైర్మన్లకు గౌరవ వేతనం నెలకు రూ. లక్ష, జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు గౌరవ వేతనం నెలకు రూ. 13వేలు, ఎంపీటీసీలకు రూ. 6,500 గౌరవ వేతనం ఇస్తున్నారు.

●ఆరు నెలలుగా పెండింగ్..

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గత యేడాది డిసెంబర్ వరకు గౌరవ వేతనం చెల్లించారు. ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలకు తక్కువగా అభివృద్ధి నిధులు కేటాయించడంతో తాము అనుకున్న అభివృద్ధి చేయలేక పోయామని ఇటీవల పదవీ కాలం పూర్తయిన పలువురు సభ్యులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లా పరిషత్‌లకు నిధులు కేటాయించి తమకు గౌరవ వేతనాలు అందించాలని స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

●ఆరు నెలల బకాయిలు రావాల్సి ఉంది



దావ వసంత సురేశ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్

జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రజా ప్రతినిధులకు ఆరు నెలల గౌరవ వేతనాలు అందాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు అందివ్వలేదు. ఇటీవల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికైనా పరిషత్ ప్రజాప్రతినిధులకు రావాల్సిన గౌరవ వేతనాలు ప్రభుత్వం విడుదల చేయాలి.

ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం

కోరుట్ల, ఆగస్టు 10 : పట్టణంలోని ఎసీకోనిగుట్ట ప్రాంతంలోని ఆంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం శనివారం కాలనీ వాసులు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా దేవాలయంలో అర్చన అభిషేక కార్యక్ర మాలను జరిపారు. భక్తులు ఆంజనేయ దండకం నిర్వహించారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, వార్డు సభ్యురాలు పుప్పాల ఉమాదేవి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలలో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు నాయకులకు పురోహితులు ఆశీర్వదించారు.

కొప్పుల ఈశ్వర్ పరామర్శ

గొల్లపల్లి, ఆగస్టు 10: గొల్లపల్లి మండలంలోని వెంగళాపూర్, రాపల్లె, ఇస్రాజ్‌పల్లె, శ్రీరాములపల్లె, దమ్మన్నపేట గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలు బాధిత కుటుంబసభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం పరామర్శించారు. ఆయా గ్రామాల్లో మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండలంలోని వెంగళాపూర్ గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్మల మల్లారెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు శంకరయ్య, జలంధర్, నల్ల శ్యామ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మారంపెల్లి బాబు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు అరికట్టాలి

కోరుట్ల, ఆగస్టు 10 : బంగ్లాదేశంలో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కొరుతూ శనివారం పట్టణంలోని హిందు ఐక్యవేదిక సభ్యులు ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ చౌరస్తాలో అమరులకు కొవత్తులను నివాళిని అర్పించి ర్యాలీని జరిపారు. హిందు ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ ర్యాలీ


తక్కళ్లపల్లిలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సభ్యుల ర్యాలీ

కథలాపూర్, ఆగస్టు 10 : ఇటీవల ఎస్సీలను వర్గీకరిస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మండలంలోని తక్కళ్లపల్లిలో అంబేద్కర్ మాల సంఘ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. రాజకీయ కుట్రతో ఎస్సీల్లో ఉన్న ఐక్యతను దెబ్బతీయడానికి వర్గీకరణను తెరమీదికి తెచ్చారని ఆరోపించారు. మతతత్వ పార్టీ బీజేపీ కుల రాజకీయాలను ప్రోత్సహించేందుకే వర్గీకరణతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. భవిష్యత్‌లో మాలలు బీజేపీకి గుణపాఠం చెప్పక తప్పదని అన్నారు. అనంతరం రాజ్యాంగ నిర్మాణ అంబేద్కర్ విగ్రహంకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కోట లక్ష్మీనర్సయ్య, కోట శంకర్, భూపల్లి సాయాబు, భూపెల్లి సంజీవ్, క్యాతం రాజేశ్, మొగిలి భూమేశ్ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన హైకోర్టు ఏజీపీ

జగిత్యాలరూరల్, ఆగస్టు 10 :జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన కొలుగూరి శాంతన్‌రావు హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా నియమితు లయ్యారు. ఈసందర్భంగా తాను ఏజీపీగా నియమితులవ్వడానికి సహకరించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను శనివారం మర్యాదపూర్వకంగా శాంతన్‌రావు కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రావు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఉప వైద్యాధికారి ఎన్. శ్రీనివాస్

కొడిమ్యాల, ఆగస్టు 10 : ప్రజలు సీజనల్ వ్యాదులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలో నమోదైన డెంగ్యూ పాజిటీవ్ కేసు ఇంటిని పరిశీలించారు. వర్షాకాలంలో వాతావరణ మార్పుల వలన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు వస్తాయని దోమలు వ్యాప్తి చెందకుండ ప్రజలు తీసుకోవాలిసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. నీటి నిల్వలు లేకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. డెంగ్యూ పాజిటీవ్ ఉన్న ఇంటి చుట్టు 50 ఇళ్ల వరకు స్ప్రే చేయాలన్నారు. నల్లగొండలో జరుగుతున్న చిన్నపిల్లల టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగుకుండా అందుబాటులో ఉండాలని సూచించారు. అవసరం ఉన్నవారికి పరీక్షలు చేసి మందులను అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.. శ్రీనివాస్, మండల వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, సబ్ యునిట్ ఆఫీర్ అవారి శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ డా.. మహిపాల్, హెల్త్ సూపర్‌వైజర్లు అలివేలు, వెంకటనర్సమ్మ, పంచాయతీ కార్యదర్శి బుచ్చయ్య, హెల్త్ అసిస్టెంట్ విష్ణువర్ధన్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

విద్యా సంస్థలన్నీ ఒక్క గొడుగు కిందికి రావాలి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్

కోరుట్ల, ఆగస్టు 10 : విద్యా సంస్థలన్నీ ఒక్క గొడుగు కిందకు రావాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్ అన్నారు. శనివారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో యూటీఎఫ్ 51వ ఆవిర్భావ వేడకల సందర్భంగా టిఎస్ యూటీఎఫ్ జెండాను ఉపాధ్యాయ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమేశ్వర్ మాట్లాడారు. 1974 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యయనము, అధ్యాపనము, సామాజిక స్పృహ అనే లక్ష్యంతో పురుడుపోసుకుని 50 ఏళ్లు పూర్తి చేసుకోని 51 సంవత్సరంలో అడుగిడుతుందని అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అనేక పోరాటాలు నిరసన కార్యక్రమాలు ధర్నాలు నిర్వహించి ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడానికి సాయశక్తులా కృషి చేస్తూ అనేక విజయాలు సాధించామని అన్నారు. సుదీర్ఘ పోరాటాలు చేసినా నిరంతరం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసమే పని చేస్తూ ఉమ్మడి రాష్ట్రంలోనూ దేశంలోనూ మేటి సంఘంగా ఎదుగుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పోరాటం చేసి సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు కొండ్ర అనిల్, శ్యామకూర శ్రీనివాస్, మాసం మధు సుదన్, మాసం చిరంజీవి, జగన్ నాయక్, చెన్న రాజశేఖర్, చెన్న ప్రవీణ్ కుమార్, శివకోటిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న యూటీఎఫ్ సంఘ నాయకులు

విద్యార్థుల పోస్టల్ కార్డు ఉద్యమం

కోరుట్ల, ఆగస్టు 10 : ఉపకార వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వానికి పోస్టల్ కార్డు ఉద్యమంను విద్యార్థులు చెపట్టారు. పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సీఎం రెవంత్ రెడ్డికి వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ పోస్టు కార్డును పోస్టు చేసి నిరసన తెలిపారు. శనివారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉపకార వేతనాలు అందక విద్యార్థులు పరీక్ష ఫీజులులతో పాటు తమకు అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులను ఎ దుర్కొంటున్నట్లు వినతిలో పేర్కొన్నారు. ప్రభుత్వం స్పదించి విద్యార్థులకు చెల్లిచవలసిన బకాయలనె వెంటనే చెల్లించాలని పోస్టల్ కార్డు ద్వార విన్నవిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టల్ కార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కార్యవర్గం ఏర్పాటు

జగిత్యాలరూరల్, ఆగస్టు 10: జగిత్యాల జిల్లా పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటు చేశారు. గౌరవ సలహాదారుడిగా జె. కొమురయ్య, అధ్యక్షుడిగా వంశీధర్, ఉపాధ్యక్షులుగా ఆరీపొద్దీన్, రాజునాయక్, శేఖర్, రవీంధర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా నరేష్, కోశాధికారిగా సతీష్‌కుమార్, అర్గనైజింగ్‌సెక్రటరీలుగా టి. రవి, నాదీమ్ హుస్సేన్, మీడియా ఇన్‌చార్జిగా నర్సారెడ్డి సలహాదారుగా రాజశేఖర్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కరాటేలో ప్రతిభ

మల్యాల, ఆగస్టు 10: కరాటే పోటీలలో మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల అల్ఫోర్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో అశ్వథామ, శ్రీహర్ష, చరిత్ బంగారు పథకాలు, అఖిల్, ప్రహలాదిక్య రజత పథకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఎల్‌వోసీ అందజేత

కొడిమ్యాల: మండలంలోని తిప్పయ్యపల్లికి చెందిన శ్రీపతి మానస అనారోగ్యం బారినపడింది. ఆమె తండ్రి శ్రీనివాస్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు మ్యాకల మల్లేశం యాదవ్‌కు కూతురు అనారోగ్యం గురించి తెలిపాడు. దీంతో మల్లేశంయాదవ్ చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకపోయాడు. స్పందించిన ఎమ్మెల్యే ఆసుపత్రిలో చికిత్స నిమ్మిత్తం రూ. 2లక్షల ఎల్‌వోసీని బాధితురాలి తండ్రికి శనివారం అందించారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవ చేయడానికి ముందుకు రావడం అభినందనీయం

పట్టణంలో సైనిక్ ఫౌండేషన్ ప్రారంభం

మెట్‌పల్లి , ఆగస్టు 10 (ఇబ్రహీంపట్నం) : పేదవారికి సేవ చేయడానికి పట్టణంలో సైనిక్ పౌండేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని చావిడి వద్ద సైనిక్ ఫౌండేషన్‌ను బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, నాయకులు మార్గం, హన్మండ్లు, చెట్లపల్లి సుఖేందర్, మధ్రి సహదేవ్, పిప్పెర రాజష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా 30 మంది పేదలకు నిత్యవసర సరుకులను అందజేశారు. వారు మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో పౌండేషన్ ప్రారంభించడం అభినందనీయం అన్నారు. రానున్న రోజులలో సేవ కార్యక్రమాలు మరింత విస్తరింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైనిక్ పౌండేషన్ వ్యవస్థాపకులు బాస చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు అరిగెల రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల దీక్షకు మాజీ మంత్రి సంఘీభావం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై జగిత్యాల జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు చేస్తున్న దీక్ష శనివారం 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దీక్షకు మాజీ మంత్రి ఈశ్వర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ చైర్మెన్ లోక బాపురెడ్డితో పాటు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత యాద రామకృష్ణ, పీఆర్టీయూ సంఘ బాధ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, కులసంఘాల బాధ్యులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ ఇళ్లస్థలాలు సాధించేవరకు మీ వెంట ఉంటానని భరోసానిచ్చారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీలో రాయికల్ న్యాయవాది



రాయికల్, ఆగస్టు 10: రాయికల్ పట్టణానికి చెందిన ప్రముఖ విద్య, ఉద్యమకారిగా పేరున్న న్యాయవాది అల్లె పురుషోత్తం జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియామకమయ్యాడు. ఏడు సంవత్సరాలుగా అణగారిన దళిత వర్గాలకు ఆయన న్యాయవాదిగా చేస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనను నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బంగ్లాదేశ్‌లో దాడులకు నిరసనగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

రాయికల్, ఆగస్టు 10:బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా రామాజీ పేటలో శనివారం గ్రామ ప్రజలు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం నుంచి హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ నిర్వహిస్తూ హిందువుల పై జరుగుతున్న దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు.

ఆర్థిక సహాయం అందజేత

బీర్‌పూర్, ఆగస్టు 10: బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన కొడిమ్యాల జగదాంబ గత మూడు రోజుల క్రిం అనారోగ్యంతో బాదపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీర్‌పూర్ గౌడ సంఘం సభ్యులు శనివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు బైరవేణి సత్యనారాయణ, సంఘ నాయకులు సతీష్ గౌడ్, గణేష్ గౌడ్, శ్రీను గౌడ్, రాజు గౌడ్, శేఖర్ గౌడ్, జితేందర్ గౌడ్ పాల్గొన్నారు.

గ్రామస్థుల శ్రమదానం

కొడిమ్యాల, ఆగస్టు 10: మండలంలోని దమ్మయ్యపేటలో బురదమయంగా మారిన రోడ్డుకు గ్రామస్థులు శనివారం శ్రమదానం చేసి మట్టిని పోసి మరమ్మతు చేశారు. వర్షాకాలం వచ్చిందంటే బురదమయంగా మారటంతో ఎవ్వరికి ఎన్ని సార్లు విన్నవించిన ఎవ్వరు పట్టించుకోలేదని ఒడ్డెర కాలనీ వాసులు తెలిపారు. బురద రోడ్డుపై గ్రామానికి వచ్చిపోయె విద్యార్థులు, వాహనాల వారు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. మల్యాల మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గోగూరి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒడ్డెర కాలనీ వాసులు సుమారు 50 వేల రూపాయలతో మట్టిని పోయించారు.

పశుగ్రాసం దగ్ధం

గొల్లపల్లి, ఆగస్టు 10: గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన బోయ పోతు కిష్టయ్య పశువుల కోసం తన ఇంటి వద్ద నిల్వ ఉంచిన పశు గ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి గడ్డి కాలుతూ పొగ రావడంతో గమనించిన కిష్టయ్య చుట్టుపక్కల వారిని లేపి బోరు మోటార్లతో నీటితో చల్లార్చారు. వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. పశుగ్రాసం నిల్వ ఉంచిన షెడ్డు సైతం మంటల్లో కాలిపోయింది. సుమరు రూ.2 లక్షల మేరకు నష్టం జరిగిందని, ఆదుకోవాలని కోరారు.